
జ్వరంతో బాధపడుతున్న బాలిక కోరాబు చిన్ని

జ్వరాల విజృంభణ

వణుకుతున్న మూడు గ్రామాల జనం

- ఇంటికొకరు మంచాన..
- వైద్యం కోసం ఎదురుచూపు
- జాడ లేని సిబ్బంది


తీవ్ర జ్వరంతో పడుకున్న లక్ష్మమ్మ

గూడెంకొత్తవీధి, ఆగస్టు 27: మండలంలో అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, తడకపల్లి, పెబ్బెంపల్లి గ్రామాల్లో జ్వరాలు విజృంభించాయి. ఆదివాసీలు ఇంటికొకరు జ్వరంతో మంచాన పడి వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. నాలుగు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నప్పటికీ వైద్య సిబ్బంది జాడ కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, తడకపల్లి, పెబ్బెంపల్లి గ్రామాల్లో నాలుగు రోజుల క్రితం కొంత మంది జ్వరాల బారిన పడ్డారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో పదుల సంఖ్యలో జ్వర బాధితులు వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. గొల్లపల్లిలో చిలకల చితుకులమ్మ, చిలకల దారబాబు, వండలం గౌరి, బోనంగి చిన్నయ్య పడాల్, తడకపల్లి గ్రామంలో కొర్ర రాజారావు, కొర్ర తిరుపతిరావు, ముర్ల సూర్యకాంతం, ముర్ల బాలేసు, పొత్తూరు మోహన్, జర్త దేవయ్య, పెబ్బెంపల్లి గ్రామంలో కోరాబు రాహేలు, చిలకల ప్రశాంత్, బోనంగి పార్వతమ్మ, చెలకల చిన్నబ్బాయి, చిలకల నాగమణి, లక్ష్మణరావు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. ఆదివాసీలకు చలితో కూడిన తీవ్ర జ్వరం రావడంలో అల్లాడిపోతున్నారు. జ్వర బాధితులు నడవలేని స్థితిలో వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైన వైద్య సిబ్బంది స్పందించి తమకు మెరుగైన వైద్యం అందించాలని ఆదివాసీలు ప్రాధేయపడుతున్నారు.

రక్తపరీక్షలు చేయకుండా పంపేశారు

గొల్లపల్లి, తడకపల్లి, పెబ్బెంపల్లి గ్రామాలు సప్పర్ల పీహెచ్‌సీ పరిధిలోకి వస్తాయి. తాము సప్పర్ల పీహెచ్‌సీకి వెళ్లేందుకు 30 కిలోమీటర్లు ప్రయాణించాలి. అదే ఆర్‌వీనగర్ పీహెచ్‌సీకి వెళ్లేందుకు పది కిలోమీటర్లు ప్రయాణించాలి. సోమవారం మూడు గ్రామాలకు చెందిన జ్వర బాధితులు కాలినడకన ఆర్‌వీనగర్ పీహెచ్‌సీకి వెళ్లాం. వైద్యాధికారి ఆస్పత్రికి ఉదయం 11:30 గంటలకు వచ్చారు. డాక్టర్ రోగులను పరీక్షించలేదు. స్టాఫ్ నర్సు పారాసిట్‌మాల్ మాత్రలు ఇచ్చి పంపించేశారు. రక్తపరీక్షలు చేయలేదు. తమ పీహెచ్‌సీ పరిధి రోగులు కారని ఆర్‌వీనగర్ వైద్య సిబ్బంది పట్టించుకోలేదు.

- లోసరి మల్లేశ్వరరావు, గొల్లపల్లి.

బాహుబలి కొండపై మేఘాల పందిరి


మండలంలోని గాదిగుమ్మి జలపాతం పరిసర ప్రాంతం ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది. బాహుబలి కొండలను ఆనుకుని మబ్బులు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. పక్షుల కిలకిలరావాలు.. రకరకాల పుష్పాలతో ఈ ప్రాంతం సుందరంగా దర్శనమిస్తోంది. - కొయ్యూరు

గాదిగుమ్మి జలపాతం ఉరకలు


లింగాపురం సమీపంలో ఉరకలు వేస్తున్న గాదిగుమ్మి జలపాతం

మండలంలో చిట్టింపాడు పంచాయతీ లింగాపురం సమీపంలో బాహుబలి కొండలపై నుంచి గాదిగుమ్మి జలపాతం ఉరకలేస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చూపరులను ఆ జలపాతం ఆకట్టుకుంటుంది. ఎత్తయిన పెద్ద రాయిపై నుంచి జాలువారుతున్న ఈ జలపాతం చూడాలంటే నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే మార్గంలో డౌనూరు చేరుకుని అక్కడ నుంచి 7 కిలోమీటర్లు గోపవరం ఆటో లేదా ద్విచక్ర వాహనంపై వెళ్ళాలి. అక్కడి నుంచి మూడు కిలోమీటర్లు బాహుబలి కొండ అంచున కాలినడకన వెళితే ఈ సుందర జలపాతాన్ని చేరుకోవచ్చు. -కొయ్యూరు

మొక్కల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

కలెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరిక

- ఐటీడీఏల ఆధ్వర్యంలో నర్సరీలను అభివృద్ధి చేయాలని సూచన
- ఎస్‌హెచ్‌సీలకు బ్యాంకు లింకేజీపై కలెక్టర్ అసంతృప్తి

పాడేరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు మొక్కల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకంలో మొక్కల పంపిణీ ప్రక్రియ అనుకున్న విధంగా జరగడం లేదన్నారు. కడియం నుంచి మొక్కల సరఫరా సైతం సక్రమంగా లేదన్నారు. ఈ విషయంలో అక్రమాలు చోటుచేసుకుంటే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. మొక్కలను సక్రమంగా సరఫరా చేయని వారిని తప్పించి మరొకరికి అప్పగించాలన్నారు. అలాగే రంపచోడవరం డివిజన్ పరిధిలో రబ్బర్ మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వాటిని కేరళ, తదితర రాష్ట్రాల నుంచి తప్పించాలన్నారు. రానున్న వారంలో ఉపాధి హామీ పథకంలోని మొక్కలన్నీ నాటాలని, లబ్ధిదారులకు పని దినాలు పెంచాలన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

స్థానికంగా నర్సరీలు అభివృద్ధి చేయాలి

జిల్లాలోని గిరిజన రైతులకు అవసరమైన మొక్కలను పంపిణీ చేసేందుకు స్థానికంగానే నర్సరీలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఐటీడీఏ పీవోలకు సూచించారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలపై రైతులకు శిక్షణ ఇప్పించాలన్నారు. అలాగే ఉపాధి హామీలో చెరువులు, కుంటలు, వాన నీటి సంరక్షణ ట్యాంక్‌లు నిర్మించాలన్నారు. అలాగే ఐటీడీఏ పీవోలు ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను పక్కాగా పర్యవేక్షించాలన్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గృహస్థాయిలోనే తడి, పొడి చెత్తను వేరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాడేరు, అరకులోయ, చింతపల్లి, లంబసింగిల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని, యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీకి రూ.438 కోట్లు

... మిగతా 8వ పేజీలో

అదుపు తప్పితే అంతే..

రైల్వే గేటు సమీపంలోని మలుపు వద్ద కూలిన రక్షణ గోడ

- ప్రమాదం జరిగితే 80 అడుగుల లోయలోకి వాహనాలు
- ఆ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ, రైల్వే శాఖలు
- రక్షణ గోడ నిర్మించాలని పర్యాటకులు, గిరిజనుల వేడుకోలు


రైల్వేగేటు వద్ద రక్షణ గోడ లేక ప్రమాదభరితంగా మారిన మలుపు

అనంతగిరి, ఆగస్టు 27: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు వెళ్లే మార్గంలోని రైల్వే గేటు సమీపంలో మలుపు ప్రమాదభరితంగా మారింది. ఈ మలుపు వద్ద రక్షణ గోడ కూలడంతో ఈ పరిస్థితి నెలకొంది. బొర్రాగుహలు పర్యాటక కేంద్రం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల పర్యాటకులు ప్రైవేటు, సొంత వాహనాల్లో తరలిస్తుంటారు. రక్షణ గోడ కూలిపోయినప్పటికీ కనీసం ఆర్‌అండ్‌బీ, రైల్వేశాఖలు స్పందించలేదు. దీంతో మలుపు ప్రమాదాలకు నిలయమైంది. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో అదుపుతప్పి లోయలో పడి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

ప్రమాదాలు జరిగినా..

రెండేళ్ల క్రితం బొడ్డవర నుంచి కోనపురం మీదుగా బట్టివలసకు సామగ్రితో వెళుతున్న లారీ ఇదే మలుపు వద్ద అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్ కాలు విగిరిపోయి, ప్రాణాలతో బయటపడ్డాడు. రెండు నెలల క్రితం కేబుల్ లోడుతో వెళ్తున్న వ్యాన్ బ్రేక్ ఫెయిల్ కావడంతో లోయలో పడి డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలపై బొర్రా బ్రో సంస్థ సభ్యులు స్పందించి, సామాజిక స్పృహతో రాళ్లను ఏర్పాటు చేసి, సున్నం వేసి, కొంతవరకు వాహనదారులకు అవగాహన కల్పించేలా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, రైల్వేశాఖల అధికారులు స్పందించి ప్రమాదాలకు నివారించేలా రక్షణ గోడను నిర్మించాలని పర్యాటకులు, గిరిజనులు కోరుతున్నారు.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

30వ తేదీ వరకూ విశాఖలోనే యువనేత

- పార్టీ నాయకులు, కేడర్‌తో సమావేశం



విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి నగరానికి రానున్నారు. ఆయన గన్నవరం నుంచి రాత్రి 8.45 గంటలకు విమానంలో బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడే బస చేస్తారు. ఈనెల 29వ తేదీ ఉదయం 9.45 గంటలకు కోర్టు('సాక్షి' పత్రికపై గతంలో దాఖలు చేసిన పరువునష్టం దావా)కు హాజరవుతారు. అక్కడ నుంచి మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని సాయంత్రం వరకు పార్టీ నాయకులు, కేడర్‌తో భేటీ అవుతారు. సాయంత్రం 6.20 గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ ఏర్పాటుచేసే డిన్నర్‌లో పాల్గొని రాత్రి 9 గంటలకు తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస్సులో బస చేస్తారు. ఈనెల 30వ తేదీన మంత్రి కార్యక్రమాలు అధికారికంగా వెల్లడించలేదు.

పార్టీ కార్యాలయం ముస్తాబు

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ నగర పర్యటనకు వస్తుండడంతో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆయన రెండు రోజులపాటు పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణం, పరిసరాలు శుభ్రం చేశారు. భవనం ముందు, ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ రంగులు వేయిస్తున్నారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని రెండు రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నగర అధ్యక్షుడు గండి బాబ్జీలు నిర్ణయం తీసుకున్నారు. ఆవరణలో టెంట్లు వేయనున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

లంబసింగి మార్గంలో రహదారిపైకి కొమ్మలు

- కనిపించని హెచ్చరిక బోర్డులు
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు


మలుపుల వద్ద ఏపుగా పెరిగిపోయిన చెట్ల కొమ్మలు

- జంగిల్ తొలగించాలని వాహన చోదకులు విజ్ఞప్తి

చింతపల్లి, ఆగస్టు 27: లంబసింగి ఘాట్ రోడ్డులో ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో ఎదురెదురుగా ప్రయాణించే వాహనాలు తప్పించుకునేందుకు ఇబ్బంది కలుగుతున్నది. హెచ్చరిక బోర్డులను కూడా కొమ్మలు కప్పేశాయి. ఫలితంగా ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. సీలేరు, భద్రాచలం, మల్కన్‌గిరిలతోపాటు జీకేవీధి, పాడేరు, చింతపల్లి వెళ్లే ఆర్టీసీ సర్వీసులు, ప్రైవేటు వాహనాలు లంబసింగి ఘాట్ మీదుగా ప్రయాణించాలి. నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలో లంబసింగి ఘాట్ 13 కిలోమీటర్లు. పదేళ్ల క్రితం అదనంగా ఐదు అడుగుల సీసీ రోడ్డు నిర్మించి 15 అడుగులుగా రహదారిని విస్తరించారు. ప్రస్తుతం చెట్ల కొమ్మలు పెరగడంతో రహదారి వెడల్పు


లంబసింగి ఘాట్‌లో చెట్ల కొమ్మల కారణంగా కనిపించని హెచ్చరిక బోర్డు

... మిగతా 8వ పేజీలో

అల్లం ధర పతనం

- కిలో రూ.40కి వర్తకుల కొనుగోలు
- గిట్టుబాటు కాక గిరిజన రైతుల ఆందోళన


అద్దరవీధిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న అల్లం

చింతపల్లి, ఆగస్టు 27: గిరిజన ప్రాంతంలో అల్లం ధర ఒక్కసారిగా పడిపోయింది. గత వారం మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి 70దరకు వర్తకులు కొనుగోలు చేశారు. మంగళవారం లోతుగెడ్డ వారపు సంతలో వర్తకులు కిలో రూ.40 దరకు కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాది గిరిజన రైతులు ఆగస్టులో పాత అల్లం పొలాల నుంచి తీసుకుని మార్కెట్‌లో విక్రయిస్తారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలో కిలోకి గరిష్ఠంగా రూ.70 ధర లభించింది. నెలాఖరు నాటికి ఒక్కసారిగా రూ.30 ధర వర్తకులు తగ్గించడంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ అల్లంకి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భూముల మ్యుటేషన్ వేగవంతం

- జాయింట్‌కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ్, పక్కన డీఆర్‌వో పద్మావతి

పాడేరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మ్యుటేషన్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అలాగే భూసంబంధ రికార్డుల నవీకరణ, ఆన్‌లైన్ ప్రక్రియలపై అలక్ష్యంగా ఉండకూడదన్నారు. అలాగే ప్రతి మంగళవారం రెవెన్యూ, భూసంబంధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, అధికారులు, సిబ్బంది అందుకు అవసరమైన సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే ఆలస్యంగా నమోదైన జనన, మరణాల ధ్రువపత్రాల జారీపై చర్యలు చేపట్టాలన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

- కేసు నమోదు ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందోనని రోజంతా తర్జనభర్జన పడిన పోలీసులు


కింతాడ కృష్ణ మృతదేహం

మల్కాపురం (విశాఖపట్నం), ఆగస్టు 27: విశాఖలోని డాక్‌యార్డు సర్దార్ వల్లాబాయ్ పటేల్ వంతెన సమీపంలో ఉన్న ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావణి షిప్పింగ్ కంపెనీలో లారీ క్లీనర్‌గా పని చేస్తున్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడు ప్రాంతానికి చెందిన కింతాడ కృష (46) అనే వ్యక్తి మృతి చెందారు. సోమవారం సాయంత్రం ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద శ్రావణ్ షిప్పింగ్‌కు చెందిన సరకును లారీలో లోడ్ చేస్తుండగా వెనక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో కృష్ణకు తీవ్ర గాయాలై మృతి చెందారు. అయితే ఈ ప్రమాదం ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద జరగడం వల్ల ఈ ప్రాంతం హార్బర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందా, లేక మల్కాపురం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు స్టేషన్ల పరిధిలోకి వస్తుందా అని తెల్సుకునేందుకు పోలీసులకు ఒకరోజు సమయం పట్టింది. ఇలా తర్జనభర్జనలు పడ్డాక చివరకు ఉన్నతాధికారులు ప్రమాద స్థలం మల్కాపురం పరిధిలోకి వస్తుందని తేల్చడంతో ఆ స్టేషన్ పోలీసులు మంగళవారం ఉదయం కేసు నమోదు చేశారు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్యామలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

153 కేజీల శ్రీగంధంతో ఐదుగురి అరెస్టు

- పట్టుబడిన శ్రీగంధం విలువ రూ.3.82 లక్షలు


పట్టుబడిన శ్రీగంధం ముక్కలు, కారు, నిందితులతో పోలీసు, రెవెన్యూ, అటవీ సిబ్బంది

కొయ్యూరు, ఆగస్టు 27: పాడేరు అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.3.82 లక్షల విలువ చేసే 153 కేజీల శ్రీగంధం ముక్కలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పాడేరు అటవీ ప్రాంతం నుంచి శ్రీగంధం అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం పోలీసు, అటవీ, రెవెన్యూ సిబ్బంది దొడ్డవరం కూడలిలో మాటు వేసి వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ సమయంలో గేద్రాల నుంచి చీడిపాలెం వస్తున్న కారు ఆపి తనిఖీ చేయగా డిక్కీలో ముక్కలుగా చేసిన 153 కేజీల శ్రీగంధం పట్టుబడినట్టు ఆయన తెలిపారు. కారులో ఉన్న వంతాడపల్లికు చెందిన ముగ్గురు, హైదరాబాదుకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించగా శ్రీగంధం ముక్కలు మోతుపట్టు గ్రామానికి చెందిన చదల అప్పలకొండ అనే వ్యక్తి, పొంతాడపల్లి గ్రామానికి చెందిన వణుకు అశోక్, కొత్తూరి ఆనంద్ హైదరాబాద్‌కు చెందిన టోని, సుధీర్‌లకు విక్రయించినట్టు చెప్పారు. స్వాధీనపరుచుకున్న శ్రీగంధంను తూనిక వేయగా 153 కేజీలు ఉందని, మార్కెట్ విలువ రూ. 3.82 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం : ఒకరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 27: పాయకరావుపేట మండలంలో పెంటకోట గ్రామ శివార్లలో పోలీసులు మంగళవారం దాడులు చేసి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు 200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ జోగారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పెంటకోట గ్రామ శివార్లలోని నది ఒడ్డున మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అక్కడ సారా తయారు చేస్తున్న కొంతమంది వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేప్రయత్నం చేయగా గజపతినగరం గ్రామానికి చెందిన రాయి గోపి అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతని నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు సమీపంలో దాచిన 200 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కి తరలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మహిళ మృతదేహం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27: పట్టణానికి ఆనుకుని ఉన్న శారదానదిలో మంగళవారం పొద్దుపోయాక గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకొచ్చిందని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆమె అనకాపల్లి సమీపంలోనే నదిలో బహుశా నది దాటుతుండగా చిక్కుకుని ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెంది ఉండొచ్చనని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి వయసు 60 ఏళ్ల పైబడి ఉండవచ్చునని, ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఎనిమిది మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కశింకోట, ఆగస్టు 27: మద్యం క్వార్టర్ బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం తమకు వచ్చిన సమాచారం మేరకు నర్సింగబిల్లి గ్రామ శివారున వాహనాలు తనిఖీలు చేయగా మునగపాక మండలం గణపర్తి గ్రామానికి చెందిన కర్రి నూకునాయుడు గణేష్ గోవిందరావు 8 క్వార్టర్ మద్యం బాటిళ్లను గోనె సంచిలో వేసుకొని వస్తుండగా పట్టుబడ్డాడన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

29 నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ఎలమంచిలి, ఆగస్టు 29: ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీ నుంచి వారం రోజుల పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరావు తెలిపారు. జనరేట్ యువర్ బిజినెస్, స్టార్ట్ యువర్ బిజినెస్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణలో స్వయం ఉపాధి ప్రాముఖ్యత, పరిశ్రమల నిర్వహణ, రుణ సదుపాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, పరిశ్రమల స్థాపనకు కావలసిన అనుమతులు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8142565416, 8106327482 నంబర్లను సంప్రతించాలని కోరారు.

కోలుకున్న 'కైలాసపట్నం' చిన్నారులు

మహారాణిపేట, ఆగస్టు 27: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ ఆ శ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతతో కేజీహెచ్‌లో చికిత్స పొందిన చిన్నారులంతా పూర్తిగా కోలుకోవడంతో వారిని డిశ్చార్జ్ చేసినట్టు సూపరింటెండెంట్ శివానంద, పిల్లల విభాగాధిపతి చక్రవర్తి తెలిపారు. ఆశ్రమంలో వారం క్రితం ఫుడ్ పాయిజన్ కావడంతో 42 మంది పిల్లలను కేజీహెచ్‌లో చేర్పించినట్టు చెప్పారు. వారంతా పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ చేసినట్టుపేర్కొన్నారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించి వారు కోలుకోనేలా కృషి చేశారన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

ప్రాణం తీసిన భూ తగాదా

- ఒకరి హత్య
- పోలీసుల అదుపులో నిందితుడు


జోగినాయుడు మృతదేహం

మాకవరపాలెం, ఆగస్టు 27: భూ తగాదాలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని తాడపాల గ్రామానికి చెందిన గనిశెట్టి జోగినాయుడు, గనిశెట్టి చిన్న, గనిశెట్టి భాస్కరరావు అన్నదమ్ములు. వీరికి గనిశెట్టి దొరబాబుతో గత కొన్ని నెలలుగా భూ తగాదాలు ఉన్నాయి. ఆ ముగ్గురు అన్నదమ్ములు వ్యవసాయం చేస్తుండగా, దొరబాబు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

ఇరువర్గాల మధ్య భూ తగాదాతో పాటు ఇంటి స్థలం వద్ద తరచూ గొడవలు జరుగుతుండేవి. దొరబాబు తన ఇంటి ముందు ఉన్న స్థలంలో రోజూ ఆటోను ఉంచేవాడు. ఆ స్థలంలో అన్నదమ్ములు రెండు రోజులుగా పశువులను కడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి దొరబాబు తన ఆటోను ఎప్పటిలాగే ఆ స్థలంలో నిలిపి ఇంట్లోకి వెళ్లాడు. దీంతో ఆటోను అక్కడ నుంచి తీసేయాలని దొరబాబుతో ఆ ముగ్గురు అన్నదమ్ములు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో దొరబాబు కుమార్తె తలకు గాయమైంది. దీంతో కోపోద్రిక్తుడైన దొరబాబు కత్తితో ఆ ముగ్గురిపై ఎదురు దాడికి దిగాడు.

ఈ ఘటనలో అన్నదమ్ముళ్లలో ఒకరైన గనిశెట్టి జోగినాయుడు(70)ను కత్తితో నరకడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. మృతుని సోదరుడు నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొరబాబును అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

టీచర్లకు మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత తప్పించాలి

- యూటీఎఫ్ నాయకుల వినతి


అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తూరు, ఆగస్టు 27: పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతను ఉపాధ్యాయుల నుంచి తప్పించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమాదేవిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. గత ప్రభుత్వంపై చేసిన పోరాటాల ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, కానీ ఈ ఫోటోలను ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు గ్రామ సచివాలయ అసిస్టెంట్‌లతో చేయించాలని చెప్పారు. అంతేగాకుండా ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫాం పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని చెప్పిందని, ఎస్ఎంసీ సభ్యులు, సచివాలయాల అసిస్టెంట్‌లు ఫొటోలు తీయకపోతే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పారన్నారు. మరుగుదొడ్ల బాధ్యత తగ్గిందని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే మరుగుదొడ్ల ఫొటోల పనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రమాదేవి స్పందిస్తూ తక్షణమే ఈ విషయాల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.లక్ష్మి, సీనియర్ నాయకులు జి.కె.ఆర్. స్వామి, అలివేలు, ఎం.వి.అప్పారావు, ఎస్.సతీశ్, ఎం.రాజునాయుడు, దేముడు నాయుడు, బాబూరావు, రవి, తేజ్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ

మూలపర్ర రైతుల డిమాండ్


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 27: మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు ఇచ్చిన మూలపర్ర గ్రామస్థులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, సర్వే చేసిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అధికారులకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్‌డీసీ రమామణి, తహసీల్దార్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మూలపర్ర గ్రామంలో పూర్వం నుంచి స్థిర నివాసం ఏర్పరచుకుని, ఇళ్లకు ఇంటి పన్నులు కడుతున్నారని, వారందరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని ఎస్‌డీసీ చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, గింజాల వెంకట రమణ, జనసేన మండలశాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, ఎస్.గోవిందరావు, నానాజీ, శ్రీను, బాబ్జీ నూకరాజు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

- యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27: ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి మండలం సంపతిపురం ప్రాజెక్టులో కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సంపతిపురం ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు వెంటనే అందేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా జిల్లాలో వందలాది మంది ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనాలు లేక, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కూడా ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నా ప్రభుత్వం గాని, జిల్లా యంత్రాంగం గాని చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా టెండర్ కండిషన్‌లకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేయక తప్పదని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. త్రినాథరావు, యర్రయ్య అర్జున్, మణికంఠ, అప్పారావు, ఆనంద్ పాల్గొన్నారు.

గుట్టుగా శిశువుల విక్రయాలు

- రూ.10 లక్షల వరకూ వసూలు
- సంతానం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగేవారే టార్గెట్
- బిడ్డను ఇస్తామంటూ ఒప్పందం
- ఆ తరువాత ప్రభుత్వ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల గుర్తింపు
- కుటుంబ, ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని డబ్బు ఎర
- ఒక్కొక్కసారి ఆస్పత్రుల నుంచి దొంగిలించి అమ్మకం

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సంతానం కోసం ఆశగా ఎదురుచూసే దంపతులే లక్ష్యంగా శిశు విక్రయాలను సాగించే ముఠాలు చెలరేగిపోతున్నాయి. జిల్లాలో అనేక ముఠాలు ఈ వ్యాపారం సాగిస్తున్నట్టు సమాచారం. నగరానికే పరిమితం కాకుండా ఇటు శ్రీకాకుళం, అటు కృష్ణా జిల్లా వరకూ తమ కార్యకలాపాలను విస్తరించినట్టు తెలిసింది.

శిశువును కొనుగోలు చేయడం దగ్గర నుంచి విక్ర యించేంత వరకూ పది నుంచి 15 మంది పనిచేస్తుంటారు. వీరంతా రెండు, మూడు జట్లుగా ఏర్పడి నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. నవజాత శిశువు కోసం వారాలు, నెలలు అన్వేషణ సాగిస్తుంటారు. వీరంతా ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసేవారు, వారితో సన్నిహితంగా ఉండేవారేనని అంటున్నారు. నగరంతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ తరహా వ్యాపారం గుట్టుగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు కూడా ఈ వ్యాపారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు, పట్టణాల్లో స్కానింగ్ కేంద్రాల వద్ద గుట్టుగా ఈ తరహా ఒప్పందాలను చేసుకుంటున్నట్టు చెబుతున్నారు.

బిడ్డ కావాలంటే...ఆపరేషన్ స్టార్ట్

అత్యంత నమ్మకమైన వారి ద్వారా వచ్చే కేసులను మాత్రమే ఈ తరహా ముఠాలు డీల్ చేస్తుంటాయి. పిల్లల కోసం ఆస్పత్రుల చుట్టూ నెలలు, సంవత్సరాల తరబడి తిరిగే దంపతులను గుర్తిస్తుంటాయి. పిల్లలు పుట్టే అవకాశం లేదని వైద్యులు నిర్ధారించే దంపతులతో టచ్‌లోకి వెళ్లి..ఎలాంటి ఇబ్బందులు లేకుండా నవజాత శిశువును అందిస్తామని చెబు తారు. దానికి వారు అంగీకరిస్తే..వెంటనే వారి ఆపరేషన్ ప్రారంభమవుతుంది. ఇందుకోసం కనీసం రూ.10 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు భోగట్టా. ఒప్పందం కుదిరిన వెంటనే ముఠా రంగంలోకి దిగుతుంది. గర్భం దాల్చినవారిని గుర్తించి వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితులను గమనిస్తారు. వారికి డబ్బు ఆశ చూపిస్తారు. బిడ్డ పుట్టేంత వరకు వారి బాగోగులు చూసుకుంటారు. అందుకు అవసరమైన ఖర్చులు సమకూరుస్తారు. బిడ్డ పుట్టిన తరు వాత మిగిలిన మొత్తాన్ని చెల్లించి తీసుకువెళుతుంటారు. ముఖ్యంగా ఇతరులతో సంబంధం లేని వారిని మాత్రమే ఇలాంటి వాటికి ఎంపిక చేసుకుంటారు. అదేవిధంగా రకరకాల కారణాలతో బిడ్డను వద్దనుకునే వారిని కూడా ట్రాప్ చేస్తారు. ఇదంతా ప్రణాళిక ప్రకారం సాగించే వ్యవహారం. ఇలాకాకుండా కొన్నిచోట్ల చిన్నారులను ఆస్పత్రులు, లేబర్ రూముల నుంచి దొంగతనం చేసి విక్రయించేవారున్నారు.

అధికారికంగా దత్తత

పిల్లలు లేని దంపతులు అనధికారికంగా ఇలా చిన్నా రులను కొనుగోలు చేయడం నేరమని బాలల సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎవరైనా పిల్లలు కావాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా దత్తత ఇస్తున్నాయని, ఇందుకోసం కారా పేరుతో వెబ్‌సైట్ ఉందని చెబుతున్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తమకు కావా లనుకునే బాలిక/బాలుడిని దత్తత తీసుకోవచ్చునంటు న్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్నారులను కొనుగోలు చేస్తే చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.


పీఆర్ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల పరిధిలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలో అధికారులు, సిబ్బందికి మంగళవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చీఫ్ ఇంజనీరు సుబ్బారెడ్డి, ఎస్ఈ రవీంద్ర ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఇంజనీర్ల బదిలీలు చేపట్టారు. ఆరు జిల్లాల పరిధిలో 335మంది ఏఈలు ఉండగా వీరిలో 30 శాతం మందిని బదిలీ చేశారు. ఏజెన్సీలో మొత్తం ఖాళీలు భర్తీచేయాలని పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించడంతో 50 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న అధికారులకు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు పంపారు. ఇంకా 72 మంది డీఈలు, 12 మంది ఈఈ బదిలీలకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 47 మంది డీఈలు, 153 మంది ఏఈలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఈ హరిరామనాయక్ ఆధ్వర్యంలో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసినవారు, పరస్పర బదిలీ కోరుకునే వారికి పోస్టింగ్ ఇచ్చారు.

విశాఖలో రేపు ఆర్థిక సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని నోవాటెల్‌లో ఈనెల 29వ తేదీన ఆర్థిక సదస్సు (సర్క్యులర్ ఎకానమీ పాలసీ టూ ఇంప్లిమెంటేషన్) జరగనున్నది. దేశం నలుమూలల నుంచి పలు రంగాల నిపుణులు హాజరుకానున్నందున సదస్సును విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాటుచేసింది. మంగళవారం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులతో నోవాటెల్‌లో సమావేశం నిర్వహించారు.

విఘ్నేశ్వరుడికి వెండి ఆభరణం బహూకరణ


విఘ్నేశ్వరుడికి సమర్పించిన వెండి ఆభరణం

నక్కపల్లి, ఆగస్టు 27: నక్కపల్లిలోని వీవర్స్ కాలనీలో వున్న విఘ్నేశ్వర స్వామి ఆలయానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం అరకిలో వెండి ఆభరణాన్ని బహూకరించింది. మంగళవారం గొట్టుముక్కల శిరీష్ సుకుమార వర్మ, సురేఖ దంపతులు నక్కపల్లిలో వున్న ఆలయానికి వచ్చి స్వామివారి విగ్రహానికి అలంకరించాలన్న ఉద్దేశంతో వెండి తొడుగును అందజేశారు. ఆలయ అర్చకులు పీవీ అప్పలాచార్యులకు ఈ ఆభరణాన్ని అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెండి ఆభరణాన్ని బహూకరించిన దంపతులను సత్కరించారు.

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ

- సీపీఎం నాయకుల డిమాండ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 27 : ఫార్మా కంపెనీల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జి.కోటేశ్వరరావు మంగళవారం లేఖలో కోరారు. ఈ మేరకు ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో చోటు చేసుకున్న ప్రమాదం రాష్ట్ర చరిత్రలో అతి పెద్దదిగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు నిర్ణీత సమయాల్లో పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సెజ్‌లో వంద పడకల ఆస్పత్రిని ఈఎస్ఐ ద్వారా నిర్మింపజేసి వారే నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వలస కార్మికుల వివరాలు నమోదు చేసి తహసీల్దార్లు సంక్షిప్తం చేయాలన్నారు. ప్రమాదకరమైన పరిస్థితులున్న పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులను మాత్రమే నియమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వేసే కమిటీలో కార్మిక ప్రతినిధులను కూడా చేర్చాలని కోరారు. ఎసెన్షియా కంపెనీ నిర్మాణ డిజైన్ లోపం వల్ల ప్రమాదం జరిగిందని నిపుణులు చెబుతున్నారని, మిగిలిన కంపెనీల డిజైన్‌లను కూడా పరిశీలించి లోపాలను సరిచేయించాలని వారు కలెక్టర్‌ను కోరారు.

నకిలీ హారం కేసులో ఈవో గంగారావు సస్పెన్షన్

నర్సీపట్నం, ఆగస్టు 27 : వేంకటేశ్వరస్వామి గ్రూపు దేవాలయాల పూర్వపు కార్యనిర్వహణాధికారి ఎస్.గంగారావుని దేవదాయ శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆభరణాలలో నకిలీ హారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు.

ప్రజోపయోగ పనులే చేపట్టండి

- అనవసర వ్యయం వద్దు
- భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతుల్లో తాత్సారం చేయొద్దు
- పీపీపీ విధానంలో వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు
- జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సమీక్షలో పురపాలక శాఖా మంత్రి నారాయణ


సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఏ పని చేపట్టినా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, అనవసర వ్యయాలు చేయవద్దని జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులకు పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ సూచించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్లు సంపత్‌కుమార్, విశ్వనాథన్, ఇతర అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు ఇవ్వడంలో తాత్సారం చేయడం తగదని, ఈ విషయంలో ఫిర్యాదులు రాకూడదని హెచ్చరించారు. ప్రతి పనికీ నిర్దేశిత సమయం ఉందని, ఆ గడువులోగా పూర్తిచేయాలన్నారు. ప్రజల్ని పదేపదే కార్యాలయాలకు వచ్చేలా చేయడం తగదన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ఆస్తుల పరిరక్షణ, రహదారుల విస్తరణ, ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలు, అనధికార నిర్మాణాలు, లేఅవుట్లు, హాకర్ జోన్లు, వెండింగ్ జోన్లపై చర్చించారు. పీపీపీ విధానంలో ఎవరు ఏయే పనులు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, ఫ్లైఓవర్లు, బస్సు షెల్టర్లు, ఫ్యూయల్ స్టేషన్లు, ల్యాండ్ మానిటైజేషన్, ముడసర్లోవలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు, నీటి సరఫరా ఆటోమేషన్ పనులు, స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల గురించి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రహదారులపై సెంటర్ మీడియన్‌లో ఉన్న ప్రకటనల బోర్డులు తొలగించాలని ఆదేశించారు. జోన్ల పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. త్వరలో ఈ అంశాలన్నింటిపైనా వీడియో కాన్ఫరెన్స్ పెట్టి వివరంగా చర్చిస్తానన్నారు.

చెరువుల మధ్య నుంచి రహదారులా!?

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను వైసీపీ నాయకులు వారికి నచ్చినట్టుగా మార్చుకున్నారని ఫిర్యాదులు ఉన్నాయని, చెరువుల మధ్య నుంచి మాస్టర్ ప్లాన్ రహదారులు వేశారని తన దృష్టికి వచ్చిందని, వాటన్నింటిపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే వీఎంఆర్‌డీఏ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేనందున ప్రాజెక్టులను పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించామన్నారు.

ప్రజాప్రతినిధులతో భేటీ

అధికారులతో సమీక్ష ముగిసిన తరువాత జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావులతో సమావేశం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, ఫ్లైఓవర్ వంతెనలు, ఓపెన్ కాలువలు, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, అండర్ గ్రౌండ్ కాలువలు, 24/7 నీటి సరఫరా, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. గత ప్రభుత్వం స్వచ్ఛ భారత్ నిధుల వినియోగంలో విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,790 కోట్లు రాష్ట్రానికి విడుదల కాలేదని మంత్రి చెప్పారు. దాంతో పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. వచ్చే నాలుగు నెలల్లో ఆర్థిక స్థితిని పూర్తిగా మెరుగుపరుస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు రవీంద్ర, వర్మ, రమణమూర్తి, వినయకుమార్, సురేశ్, శ్రీనివాసరావు, ఫణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి వేషధారణలో గిడ్డి ఈశ్వరి



పాడేరు, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో బ్రహ్మకుమారీలు మంగళవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి శ్రీకృష్ణుడి వేషధారణ వేశారు. ఆమె కాసేపు శ్రీకృష్ణుడిగా వేణువు ఊదుతున్నట్టుగా అలరించారు. అనంతరం గిడ్డి ఈశ్వరికి బ్రహ్మకుమారీలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

29న సమస్యలపై రిలే నిరాహార దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్

పాడేరు రూరల్, ఆగస్టు 27: జిల్లాలోని గిరిజన, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలపై ఈ నెల 29వ తేదీన రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ తెలిపారు.మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు బకాయి ఉన్న మెస్, కాస్మోటిక్స్ బిల్లులు చెల్లించాలని ఈ సం దర్భంగా డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కమాటీ పోస్టులు భర్తీ చేయాలని, వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బందిని నియమించాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలన్నా రు. పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థులకు నోట్ బుక్‌లు సరఫరా చే యాలని కోరారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌లో ఒక్క రోజు భోజనానికి రూ. 90 కేటాయిస్తున్న ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు రోజుకి రూ. 33 మాత్రమే ఇవ్వడం అన్యాయమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు వి.కృష్ణారావు, పి.చిన్నబాబు, జి.తనీష్, ఈశ్వర్, మల్లేష్, సుశాంత్ పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 27: పీవీటీజీ గ్రామాల్లో ఆదివాసీలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. సాగులు గ్రామంలో మంగళవారం జన్‌మన్ గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో ఆదివాసీలకు అందుబాటులోనున్న సదుయాలు, అవసరమైన సదుపాయాలపై సమీక్షించడం జరిగిందన్నారు. గ్రామంలో కొంత మందికి ఆధార్ కార్డులులేవని, కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో పదకొండు మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయని, అర్హులందరికి పక్కా గృహాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రావిటీ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, రక్షిత నీటి పథకం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజ్యలక్ష్మి, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీవోలు

అరకులోయ, ఆగస్టు 27: ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఈనెల 29 తెలుగుభాషా దినోత్సవం పురస్కరించుకొని తెలుగువిభాగం ఆధ్వర్యంలో పద్యపఠనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించామన్నారు. విజేతలకు 29న బహుమతులందిస్తామన్నారు. అలాగే, విద్యార్థులపై మా దకద్రవ్యాలు-మత్తుపదార్థాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమలలో వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్, తెలుగు అధ్యాపకులు ఎస్.సోంబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, ఎం. అనితకుమారి అధ్యాపకులు గణేష్, సుందరిరాణి పాల్గొన్నారు.

171 మందికి కంటి పరీక్షలు



రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డుంబ్రిగుడ, ఆగస్టు 27: స్థానిక పీహెచ్‌సీలో హెచ్ఆర్ ఏసీప రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది సేవలందించారు. 171 మంది వైద్య పరీక్షలు నిర్వహించి, 36 మందికి కాటరాక్ట్ సమస్యలున్నట్టు గుర్తించారు. మరో 39 మం దికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించినట్టు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, సంతోష్ పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 24 మంది తరలింపు



కంటి శస్త్రచికిత్సల కోసం విశాఖపట్నం వెళుతున్న గిరిజనులు

చింతపల్లి, ఆగస్టు 27: సబ్ డివిజన్ పరిధిలో కంటి సమస్యలతో బాధపడుతున్న 24 మంది ఆదివాసీలను శస్త్ర చికిత్స కోసం విశాఖపట్నం కంటి ఆస్పత్రికి తరలించామని దృష్టి ఐకేర్ ఎండీ, ఆప్టొమెట్రిస్టు గాలి జగన్ తెలిపారు. మంగళవారం బాధితులను ప్రత్యేక బస్సులో విశాఖపట్నం పంపించారు. ఈసందర్భంగా ఎండీ, ఆప్టొమెట్రిస్టు మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఐటీడీఏ సహకారంతో నిర్వహిస్తున్న దృష్టి ఐకేర్ ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటూ అవసరమైన బాధితులకు శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు. ఇప్పటికి 1500 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. అంధత్వంతో బాధపడుతున్న గిరిజనులకు ఉచిత రవాణ సదుపాయంతోపాటూ శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు దృష్టి ఐకేర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ▸▸ బిర్రుగూడ గెడ్డ దాటుతూ కొట్టుకుపోయిన నలుగురు యువకులు
- ▸▸ ద్విచక్ర వాహనాన్ని గెడ్డ దాటించబోయి ప్రమాదం
- ▸▸ ఈత కొట్టుకుంటూ సురక్షితంగా బయటపడ్డ యువకులు



ద్విచక్ర వాహనాన్ని గెడ్డ దాటిస్తున్న యువకులు

అదుపుతప్పి గెడ్డలో కొట్టుకుపోతున్న యువకులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 27: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ వద్ద సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ద్విచక్ర వాహనాన్ని మోస్తూ గెడ్డ దాటిస్తున్న నలుగురు యువకులు అదుపుతప్పి కొట్టుకుపోయారు. అయితే వారు చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వాట్సాప్ గ్రూపులో మంగళవారం హల్‌చల్ చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే...

ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు గ్రామానికి చెందిన వి.రాజు లక్ష్మీపురం ద్విచక్ర వాహనంపై వస్తూ బిర్రుగూడ వాగు దాటలేక స్థానిక యువకుల సహాయాన్ని కోరాడు. నలుగురు యువకులు ద్విచక్ర వాహనానికి కర్రలు కట్టి గెడ్డ దాటించేందుకు ప్రయత్నించారు. నీటి ఉధృతికి అదుపు తప్పి కొంత దూరం కొట్టుకుపోయారు. అయితే చాకచక్యంగా ఈత కొట్టుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. గంట తరువాత స్థానికుల సహాయంతో ద్విచక్ర వాహనాన్ని గెడ్డ నుంచి బయటకు తీసుకువచ్చారు. వాగులో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల ప్రమాదం జరిగిందని ఆ ప్రాంతీయులు చెబుతున్నారు.

బిర్రుగూడ వంతెన నిర్మించాలి

బిర్రుగూడ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయపై అసంపూర్తి పనులతో ఉన్న వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సర్పంచ్ కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. వంతెన పనులు పూర్తికాపోవడంతో గెడ్డ దాటుతూ రాకపోకలు సాగించేందుకు పలు గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గెడ్డ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలి

- ▸▸ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల, ఆగస్టు 27: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకుసాగాలని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించకపోయినప్పటికీ రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నందున కార్యకర్తలకు ఎంతటి కష్టం వచ్చినా పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల కష్టాల్లో అహర్నిషలు తోడుగా ఉంటానన్నారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్త పట్టుదలతో కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ వంతాల కళ్యాణిని సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాటి భీంబాబు, ప్రధాన కార్యదర్శి కిముడు కళ్యాణ్, పార్టీ ముఖ్యనాయకులు ఎస్.నాగబ్బాయి, జి.పద్మ, ఎం.రామారావు, కె.రామకృష్ణ, పి.రామన్న, కె.లక్ష్మణరావు, రెడ్డిబాబు, రాజారావు, మాలంనాయుడు, కొండబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో 386 ఎకరాల్లో మొక్కల పెంపకం



ఏపీవోతో కలిసి రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్

అరకులోయ, ఆగస్టు 27: మండలంలో 386 ఎకరాల్లో ఉపాధి పథకం కింద సిల్వర్‌ఓక్, సపోటా మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకున్నట్టు ఏపీవో జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ముమ్మరంగా మొక్కలు నాటే పనులు జరుగుతున్నాయి. ఎంపిక చేసిన రైతులకు సిల్వర్‌ఓక్, సపోటా మొక్కలు పంపిణీ చెసామన్నారు. కొంతమేర కొత్త భల్లుగుడ పంచాయితీ పరిధిలో మొక్కలు సరఫరా చేయాల్సి ఉందన్నారు. 386 ఎకరాలకుగాను 366 ఎకరాల్లో సిల్వర్‌ఓక్, 20 ఎకరాల్లో సపోటా మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందుకు మొత్తం 342 మంది లబ్ధిదారులున్నట్టు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సుమారు రూ. 20 కోట్ల విలువగల పనులను గుర్తింనట్టు వివరించారు. వీటిలో భూ అభివృద్ధి పనులు, టెర్రస్‌లు, గోశాలలు, ప్లాంటింగ్ పనులు ఉన్నాయన్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో 14780 మందికి జాబ్‌కార్డులున్నాయని, సాధారణ పనిదినాలు 100 రోజులు కాగా, ఆర్ఓఎఫ్ఆర్ రైతులకు మాత్రం 150 పనిదినాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 1300 మంది కూలీలు 100రోజుల పనిదినాలు పూర్తి చేసినట్టు చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రోజువారి కూలీ రూ. 275 నుంచి రూ. 300కు పెంచారన్నారు. ఉపాధి కూలీలకు ఉన్న సుమారు రూ.40 లక్షల బకాయిలు ఇటీవల చెల్లించినట్టు చెప్పారు. ఈనెల 12 తర్వాత చేపట్టిన పనులకు మాత్రమే వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే, ఇటీవల గ్రామసభల్లో ప్రతిపాదనలకు సంబంధించి పనులు చేపడతామన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో సర్వే వేగవంతం

పాడేరు రూరల్, ఆగస్టు 27: జిల్లాలోని పీవీటీజీ గ్రామాల్లో అభివృద్ధి, జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన్‌మాన్-2 సర్వేను వేగవంతం చేయాలని గిరిజన సంఘం నేత కిల్లో ప్రభు కోరారు. గతంలో పీవీటీజీ గ్రామాల్లో సర్వేలు నిర్వహించినప్పటికీ రాజకీయ కోణంలో వాళ్లకు సంబంధించిన వారికి మాత్రమే సర్వేలు నామమాత్రంగా చేపట్టి చేతులు దులుపుకొని పీవీటీజీలకు చేసిన అన్యాయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం చేపడుతున్న సర్వేలోనైనా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక దృష్టిసారించి సర్వేలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రధాన మంత్రి జన్‌మాన్-2 సర్వేను న్యాయ బద్ధంగా చేపట్టి పీవీటీజీ గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పణకు చర్యలు చేపట్టాలని కోరారు. పీవీటీజీ గ్రామాల్లో తాగునీరు, రహదారి, పాఠశాల, పారిశుధ్యం, విద్య, వైద్య సదుపాయాలు సంపూర్ణంగా లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పీవీటీజీ గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన గృహాలకు బిల్లులు చెల్లించి, వాటిని అధికారులు ఈ సర్వే ద్వారా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 27: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈమేరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో సెప్టెంబరు ఒకటి వరకు కనిష్ఠంగా మూడు మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 30 మీల్లీలీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. వర్షాల వల్ల పంటల్లో తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటుందని, రైతులు లక్షణాలను గుర్తించి వర్షాలు తగ్గిన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

టోకూరులో జడ్పీ నిధులతో డ్రైనేజీ పనులు

అనంతగిరి, ఆగస్టు 27: టోకూరు పంచాయతీ కేంద్రంలో జడ్పీ నిధులు రూ.7.5 లక్షలతో డ్రైనేజీ పనులకు జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ మోస్య మంగళవారం ప్రారంభించారు. డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి, గ్రామమంతా వ్యాధులు ప్రబలుతున్నాయని, అందుకే వీటి నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న, సారా దొన్ను, సమర్ది దొన్ను, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

తక్కువైపోయింది. ఎదురెదురుగా ప్రయాణించే భారీ వాహనాలు తప్పించుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఘాట్ రోడ్డుకి ఇరువైపులా చెట్ల కొమ్మలు భారీగా పెరిగిపోయాయి. రహదారి పూర్తిగా కనిపించడం లేదు. మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడం కష్టంగా ఉంది. అలాగే ఘాట్ రోడ్డులో పలుచోట్ల ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు కూడా కనిపించడం లేదు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. కొత్తగా ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వచ్చే నెల నుంచి లంబసింగిని సందర్శించేందుకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు లంబసింగిని సందర్శించే అవకాశముంది. పర్యాటకులకు లంబసింగి ఘాట్ కొత్త కావడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి లంబసింగి ఘాట్‌కు ఇరువైపులా పెరిగిపోయిన చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రాంతీయులు కోరుతున్నారు. అలాగే హెచ్చరిక బోర్డులను కప్పేసిన కొమ్మలను కూడా తొలగించాల్సిన అవసరం ఉంది.

వైద్య సిబ్బంది కొరతతో రోగుల అవస్థలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 27: సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులు అవస్థలు పడుతున్నారని గిరిజన సంఘం జిల్లా నేత కె.త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో వివిధ విభాగాలకు సంబంధించి సుమారు పది మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురు వైద్యులను మాత్రమే నియమించారన్నారు. 23 పంచాయతీల ప్రజలు ఆధారపడి ఉన్న సీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బంది కొరత కారణంగా సేవలు పొందేందుకు వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉన్న అరకొర వైద్యులు, వైద్య సిబ్బందిపై పని భారం పడుతుందని, రోజుకు 100 నుంచి, 200 మందికి వైద్య సేవలు అందించడం వారికి తలకు మించిన భారంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని , సీహెచ్‌సీకి వచ్చే రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందే విధంగా చూడాలని ఆయన కోరారు.

విద్యుత్ సంస్థలో కార్మికులకు రెగ్యులర్ చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ యూనియన్ నాయకులు, కార్మికులు

సీలేరు, ఆగస్టు 27: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడ్ని రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీలేరులో సెప్టెంబరు 5వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాల పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులందరికీ 2022 పీఆర్‌సీ వేతనాల ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. వాచ్‌మన్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా చేరిన కార్మికులను పాత ఆపరేటర్లతో సమానంగా రూ.27,953 వేతనం చెల్లించాలన్నారు. ఐటీఐ విద్యార్హత కలిగిన కార్మికులకు స్కిల్డ్ వేతనం అందించాలన్నారు.

మొక్కల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

... 5వ పేజీ తరువాయి

కేటాయిస్తే కేవలం రూ.70 కోట్ల మాత్రమే బ్యాంకు లింకేజీ జరిగిందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రికవరీలో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టిస్తామని కలెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. అలాగే ఓటరు జాబితా సవరణలపై ఎంపీడీవోలు పర్యవేక్షించాలని, బీఎల్‌వోలు సక్రమంగా స్పందించకపోతే ఐటీడీఏ పీవోల ద్వారా తనకు నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్ (పాడేరు), కట్టా సింహాచలం (రంప), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శివయ్య, ఉపాధి హామీ ఏపీడీలు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎం పాల్గొన్నారు.

భూముల మ్యుటేషన్ వేగవంతం

... 5వ పేజీ తరువాయి

ధ్రువపత్రాల జారీని వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలని, వాటికి సంబంధించిన రికార్డులను కంప్యూటరీకరణ చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జేసీ అభిషేక్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు, సబ్‌కలెక్టర్లు, 22 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

జిల్లా నిఘా కమిటీ సభ్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, ఆగస్టు 27: ఏఎస్ఆర్ జిల్లా నిఘా కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జి.జనార్దనరావు తెలిపారు. స్కావెంజర్ల పురావాస చట్టం-2013 అమలులో భాగంగా నిఘా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కమిటీలో ఒక మహిళతో పాటు నలుగురు సభ్యులు ఉంటారన్నారు. మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థల్లోని కార్యకర్తలు లేదా జిల్లాలో నివసించే స్కావెంజర్స్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ లోగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు 7036408143 ఫోన్ నంబరుకు సంప్రదించాలని ఆయన సూచించారు.

భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

చింతపల్లి, ఆగస్టు 27: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ టి.రామకృష్ణ హెచ్చరించారు. రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, గ్రామకంఠాలు, పోరంబోకు భూములపై వీఆర్వోలు సర్వే చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కట్టడాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. గిరిజనులు వారసత్వ భూములను మ్యూటేషన్ చేయించుకోకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోతున్నారని చెప్పారు. తండ్రుల ఆస్తుల్లో మహిళలకు సైతం హక్కు ఉంటుందన్నారు. మ్యూటేషన్ చేయించుకుంటే రైతు భరోసా, ఉచిత ఎరువులు, విత్తనాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనపై ప్రజలకు వీఆర్వోలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీటీ రాజ్ కుమార్, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

56 గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

అనంతగిరి, ఆగస్టు 27: మండలంలోని 56 గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపిచామని విద్యుత్ శాఖ ఏఈ రామలింగేశ్వరరావు తెలిపారు. పినకోట పంచాయతీ వంట్లమామిడి గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గిరిజనులు వేడుకోలుపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఏఈ స్పందించారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించినట్టుగా తెలిపారు. అలాగే మరో 56 గ్రామాలకు విద్యుత్ స్తంభాలు అవసరం ఉన్నాయని, అధికారులు నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

ఆస్పత్రిలో ఖాళీలు భర్తీచేయాలి

చింతపల్లి, ఆగస్టు 27: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులను భర్తీ చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆస్పత్రిని సందర్శించిచారు. అనంతరం సూపరింటెండెంట్ ప్రభావతితో మాట్లాడుతూ ఆస్పత్రి భవనం 20 ఏళ్ల కిందటిది కావడంతో రోగులు, వైద్యులకు వసతి సరిపడక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆస్పత్రి పనులు వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కాగా, ఆస్పత్రిలో షార్ట్‌సర్క్యూట్‌లో ఎలక్ట్రిషియన్ గాయపడంపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, నాయకులు నరేశ్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నేత్ర దాన పక్షోత్సవ ర్యాలీ

డుంబ్రిగుడ, ఆగస్టు 27: జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను పురస్కరించుకొని స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హైవే మూడు రోడ్ల జంక్షన్ మీదుగా బీఎస్ఎన్ఎల్ టవర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం వైద్యాధికారి పి.రాంబాబు మాట్లాడుతూ నేత్ర దానం చేయడం వల్ల అంధత్వం గలవారికి చూపును ప్రసాదించవచ్చని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మానవత్వంతో నేత్ర దానం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

డుంబ్రిగుడ, ఆగస్టు 27: మండల పరిషత్ కార్యాలయ సమవేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

చింతపల్లి, ఆగస్టు 27: ఏరియా ఆస్పత్రిలో సోమవారం మరమ్మతు పనులు చేస్తూ షార్టుసర్క్యూట్ వల్ల గాయపడిన ఎలక్ట్రిషియన్ గుల్లెలి లక్ష్మణ్‌కు సూపరింటెండెంట్ ప్రభావతి ఆర్థిక సాయం అందజేశారు. అతని వైద్యం కోసం సర్పంచ్ పుష్పలత రూ.5 వేలు, ఆస్పత్రి నిధుల నుంచి రూ.5 వేలు, సూపరింటెండెంట్ వ్యక్తిగత నిధుల నుంచి రూ.2 వేల నగదును అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీడీవో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు వినియోగించుకోండి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 27: ఆదివాసీ రైతులు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోయిన కుమారి కోరారు. వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు రాయితీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ ఏడాది సీజన్‌కు ముందుగానే విత్తనాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. 90 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు పొలంలో నాట్లు వేయాలన్నారు. విత్తనాలను దళారీలకు విక్రయించరాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేశ్, వైస్ ఎంపీపీ దేముడు, సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, కూటమి నాయకులు కొర్ర బలరామ్, కల్యాణి, ఎస్ఐ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 27: ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పెదవలస వైద్యాధికారి కోమలి సూచించారు. చినజడుముగు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటుచేసి, 15 మందికి రక్తపూతలు సేకరించి మలేరియా పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో జ్వరాలు, అతిసార ప్రబలే ప్రమాదం ఉంద న్నారు. వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, బాలరాజు, అనీషా, మాధవి, బంగారమ్మ పాల్గొన్నారు.